పంటలకు రక్ష.. భూసార పరీక్ష

- మట్టి సేకరణకు ఇదే అదును
- పరీక్షా ఫలితాలతో వృథా ఖర్చులకు చెక్
- నాణ్యమైన దిగుబడుల సాధనకు సరైన మార్గం
- రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ


మట్టినమూనాలను సేకరిస్తున్న వ్యవసాయ సిబ్బంది

కలసపాడు : వ్యవసాయ భూములు ఆరోగ్యంగా ఉంటే నాణ్యమైన దిగుబడులు అందుకోవచ్చు. అందుకు రైతులు భూసార పరీక్షలు చేయించుకొని ఫలితాల ఆధారంగా పంటలు సాగు చేస్తే వృథా ఖర్చులను ఆదా చేసుకోవచ్చు. వ్యవసాయ భూముల్లో సహజంగా ఉండే పోషక పదార్థాలతోపాటు అదనంగా సేంద్రియ ఎరువులు అందించి మొక్కలకు మరిన్ని పోషకాలు ఇవ్వగలిగితే అధిక దిగుబడులు పొందవచ్చనివ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. రైతులు నేలను కాపాడుకోవడానికి భూసార పరీక్షలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. సుస్థిర దిగుబడులు పొందడానికి రైతులు ఏటా భూసార పరీక్షలు చేయించుకుంటే ఎంతో మేలు. భూమిలో ఉండే పోషక పదార్థాలతోపాటు చౌడు గుణాలు, సున్నపు శాతం, నేల కాలుష్యాన్ని గుర్తించేందుకు భూసార పరీక్షలు దోహదపడతాయి. పరీక్షలు చేస్తే ఫలితాలను బట్టి ఏఏ పోషకాలు అవసరమో తెలుస్తుందని, దీనిని బట్టే పంటల దిగుబడులు చాలా వస్తాయని పేర్కొంటున్నారు. గతంలో చాలా మంది రైతులు భూసార పరీక్షలు చేయించుకోవడానికి మొగ్గు చూపేవారని, పచ్చిరొట్ట సాగు చేసి భూసారం పెంచేవారని వారు స్పష్టం చేస్తున్నారు.

అవగాహన లేమితో నష్టం

కానీ కాలక్రమేనా సాగులో భారీ మార్పులు చేసుకుంటున్నాయి. రైతులకు వ్యవసాయాధికారులు సాగులో మెళకువలు నేర్పుతున్నప్పటికీ కొందరు కర్షకులు నిర్లక్ష్యం చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత వానాకాలం సాగుపై అన్నదాతలు దృష్టి సారించారు. కానీ భూమిలో పోషకాల స్థాయి తెలుసుకునేందుకు మక్కువ చూపడం లేదని సమాచారం. విరివిగా రసాయన ఎరువులు వాడుతూ సాగు చేస్తుండటంతో భూమిలో పోషక విలువలు తగ్గి ఆశించిన మేర దిగుబడులు రాక నష్టపోతున్నారు. సాగులో సందేహాలను వ్యవసాయాధికారులు నివృత్తి చేస్తున్నారు. పంటల మార్పిడి, నీటి పొదుపు, బిందు, తుంపర సేద్యం చేయాలని సూచిస్తున్నారు. భూసార పరీక్షలు చేయించుకోవాలని, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని కోరుకుంటున్నారు. అందుకు తగిన సలహాలు, సూచనలు చేస్తున్నారు. ఇదిలా ఉండగా భూసార పరీక్షలకు కొందరు రైతులు మొగ్గు చూపకపోగా పరీక్ష చేయించిన వారికి వ్యవసాయాధికారులు సమయానికి ఫలితాలు అందించడం లేదనే విమర్శలు కూడా లేకపోలేదు.

ఫలితాల ఆధారంగా సాగు

భూసార పరీక్షలు చేయించుకుని వాటి ఫలితాల ఆధారంగా పంటలు సాగు చేస్తే అధిక దిగుబడి వస్తుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. మొక్కల పెరుగుదలకు 16 రకాల పోషకాలు అవసరమని, భూసార పరీక్షల ద్వారా భూమిలో లవణ సూచిక పోషకాలు, నత్రజని, భాస్వరం, పొటాష్‌ల లభ్యతను తెలుసుకునే అవకాశం ఉంటుంది. దీంతో అవసరమైన మోతాదులో ఎరువుల వినియోగానికి అవకాశం ఉంటుంది. కొందరు రైతులు ఒకే పంటను తరచుగా సాగు చేస్తుండటంతో పాటు అధిక రసాయన ఎరువులు వినియోగిస్తుండటంతో భూమి సారం కోల్పోయి పంటల దిగుబడి తగ్గుతాయి.

మట్టి సేకరణలో జాగ్రత్తలు

భూసార పరీక్షలు చేయించుకోవడానికి ముందుగా మట్టి సేకరణ గురించి తెలుసుకోవాలి. మట్టి నమూనా సక్రమంగా లేకపోతే భౌతిక, రసాయనిక, జీవ లక్షణాల అంచనా సక్రమంగా ఉండదు. ఇటువంటి సమయంలో నిపుణుల నుంచి కూడా కొన్ని సందర్భాల్లో పంట సమస్యలపై సరైన సిఫార్సులు అందుకోలేం. పెట్టుబడి ఖర్చులు సైతం పెరిగి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు తప్పవు. అందుకే మట్టి నమూనా సేకరణలో తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది.

అవగాహన కల్పిస్తున్నాం



భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా సాగు చేస్తే అధిక దిగుబడులు వస్తాయి. ఏటా మట్టి పరీక్షలు చేయించాలి. తద్వారా నేలతల్లి ఆరోగ్యం తెలుస్తుంది. ఆ మేరకు కావాల్సిన పోషకాలను ఇవ్వగలిగే ఎరువులు వాడుకునే అవకాశం ఉంది. సాగులో వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించాలి. సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలి. భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

జాకీర్‌షరీఫ్, మండల వ్యవసాయాధికారి, కలసపాడు మండలం

ప్రభుత్వ భూములు పేదలకే చెందాలి

పోరుమామిళ్ల: ప్రభుత్వ బంజరు భూములు పేదలకు పంపిణీ చేయాలని దశాబ్దాలుగా రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు స్పందించడం లేదని సీపీఐ ఏరియా కార్యదర్శి పిడుగు మస్తాన్ ఆరోపించారు. బుధవారం సీపీఐ ఆధ్వర్యంలో చెన్నారెడ్డిపేట సమీపంలో కొండ దిగువ భూముల్లో పేదలు ఎర్రజెండాలు పాతారు. మస్తాన్ మాట్లాడుతూ పుల్లివీడు పంచాయతీలోని చెన్నారెడ్డిపేట, బొప్పాపురం, పుల్లివీడు గ్రామాల దళితులకు 30 సంవత్సరాలుగా ప్రభుత్వం ఒక్క ఎకరా భూమి ఇవ్వలేదన్నారు. బొప్పాపురం పొలం సర్వే నెంబర్ 181లో బంజరు భూమి ఉందన్న సమాచారం తెలిసి, బుధవారం దళితులు కంప చెట్లు కొట్టి, చదును చేసుకుంటున్న సమయంలో చెన్నారెడ్డిపేటకు చెందిన బ్రహ్మానందరెడ్డి ఆయన అనుచరులు జేసీబీలతో వచ్చి చదును చేసి ఆక్రమణకు దిగడం దారుణమన్నారు. ఆ భూమిని పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

ప్రైవేట్ హాస్పిటల్స్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు క్రైం : నిబంధనలను అతిక్రమించి నిర్వహిస్తున్న ప్రైవేట్ హాస్పిటల్స్‌పై చర్యలు తీసుకోవాలని రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఏ హాస్పిటళ్లలోనూ సదుపాయాలు లేవని తెలిపారు. కొన్ని హాస్పిటల్స్‌లో అయితే మరుగుదొడ్లు కూడా లేవని పేర్కొన్నారు. స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు కూడా ధరల పట్టిక పెట్టకుండా ఇష్టాను సారంగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు.

క్లుప్తంగా

రేపు ఉద్యోగ మేళా

మైదుకూరు : మైదుకూరులో శుక్రవారం ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్థానిక బద్వేలు రోడ్డులోని శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఓబుళరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు నిర్వహించే ఈ జాబ్ మేళాలో జాన్ డీర్, టాటా ఎలక్ట్రికల్స్, నవభారత్ ఫర్టిలైజర్స్, ఎయిల్ డిక్షన్, యంగ్ ఇండియా, అపోలో ఫార్మసీ తదితర 13 కంపెనీలు 715 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని ఆయన వివరించారు. అర్హులైన అభ్యర్థులు తమ విద్యార్హత సర్టిఫికెట్లు, బయోడేటాతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు నరసింహులు 9182335843, శివకృష్ణ 9398348760 సెల్ నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

చౌక దుకాణాల తూకపు మిషన్ల తనిఖీ

చాపాడు : మండలంలోని అన్ని చౌక దుకాణాలకు చెందిన చెందిన తూకపు మిషన్లను బుధవారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం వద్ద తూనికలు, కొలతల శాఖ అసిస్టెంటు కంట్రోలర్ రవీంద్రారెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈయన మాట్లాడుతూ వచ్చే నెల జూన్ 1 నుంచి రేషన్ పంపిణీ ఎండీయూ వాహనాల ద్వారా కాకుండా చౌక దుకాణాల వద్ద పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇందులో భాగంగా తూకపు యంత్రాలు, ఈ కార్యక్రమం డిప్యూటీ తహసీల్దారు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్తోమత లేని ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం


సబ్‌జైలులో రిజిస్టర్లు పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్

బద్వేలు అర్బన్ : సబ్‌జైలులోని అవసరమైన ఖైదీలు ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫకృద్దీన్ పేర్కొన్నారు. పట్టణంలోని సబ్‌జైలును బుధవారం సందర్శించిన ఆయన జైలు పరిసరాలను, వసతిగదులు, వంటగది, మరుగుదొడ్లను పరిశీలించి అనంతరం రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఖైదీలకు అందుతున్న సదుపాయాలను సబ్‌జైలు సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక స్తోమత లేని ఖైదీలు జిల్లా న్యాయసేవాధికార సంస్థ, మండల న్యాయ సేవాధికార సంస్థను సంప్రదిస్తే ఉచిత న్యాయ సహాయాన్ని అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సబ్‌జైలు సూపరింటెండెంట్ శ్రీహరి, కోర్టు సిబ్బంది, ప్యానల్ న్యాయవాదులు, పారాలీగల్ వాలంటీర్లు, సబ్ జైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ


కృష్ణమ్మను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ గోవిందరెడ్డి

పోరుమామిళ్ల : రాష్ట్ర మహిళా ఆర్థిక సహకార సంస్థ మాజీ చైర్‌పర్సన్ కృష్ణమ్మను బుధవారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో కృష్ణమ్మ హైదరాబాదులోని అపోలో ఆసుపత్రిలో చికిత్స తీసుకుని, పోరుమామిళ్ల తమ స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. సమాచారం తెలిసి గోవిందరెడ్డి వెళ్లి ఆరోగ్యంపై విచారించారు. ఆయన వెంట నియోజకవర్గ బూతు కన్వీనర్ల సమన్వయకర్త రమణారెడ్డి, జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీ సీయం బాషా, జిల్లా ఆర్గనైజేషనల్ సెక్రటరీ రాళ్లపల్లి నరసింహులు, జిల్లా ప్రచార విభాగ అధ్యక్షులు రాజీవ్ బాషా, కాశినాయన మండల కన్వీనర్ హనుమంతారెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షులు పాదిలి మస్తాన్, యూత్ లీడర్ చిత్తా ప్రణీత్‌రెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షులు సాయి నారాయణరెడ్డి, వార్డు మెంబర్స్ హుసేన్‌పీరా, సుబ్బారావు ఉన్నారు.

వెంకటరెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన నాగార్జునరెడ్డి

రోడ్డు ప్రమాదంలో కొండుగారిపల్లెకు చెందిన కాంట్రాక్టర్ వెంకటరెడ్డి మృతి చెందిన విషయం తెలిసిందే. బుధవారం ప్రభుత్వ రాష్ట్ర మాజీ సలహాదారు నాగార్జునరెడ్డి వెంకటరెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట విశ్రాంత జిల్లా డిప్యూటీ డీఎం హెచ్‌ఓ డాక్టర్ మార్కారెడ్డి, రాజాసాహేబ్‌పేట మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ ఉన్నారు.

మంత్రి లోకేష్ వ్యాఖ్యలు హాస్యాస్పదం

దువ్వూరు : మహానాడులో మంత్రి నారా లోకేష్ వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నియోజకవర్గ కన్వీనర్ ఓబుళరెడ్డి విమర్శించారు. రాజకీయ కక్షతో చనిపోయిన తోట చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వం తరఫున ఉద్యోగం ఇచ్చామని గొప్పగా చెప్పుకోవడం కాదని, చిత్తశుద్ధి ఉంటే ఎమ్మెల్యే, ఎంపీ టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బుధవారం ఈయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులకు గురి చేసిన నందిగామ సురేష్‌కు వైఎస్సార్‌సీపీ అధినేత ఎంపీగా గెలిపించి ఒక దళితుడిని దేశ ప్రధాని పక్కన నిలబెట్టిన ఘనత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గొప్పతనమని కొనియాడారు.

నేటి నుంచి అమృతేశ్వరుడి బ్రహ్మోత్సవాలు


అమృతేశ్వరస్వామి


మరకత లింగేశ్వరస్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : పెన్నానది తీరంలో నిర్మించిన శ్రీ అమృతేశ్వరాలయం ఆధ్యాత్మిక కేంద్రంగా ప్రసిద్ధి చెందింది. మహాశివుని ద్వాదశ జ్యోతిర్లింగాలు, అమ్మవారి అష్టాదశ శక్తిపీఠాలు ఒకే చోట భక్తులకు దర్శనమిస్తాయి. అమృతేశ్వరస్వామి త్రిశూలం, రుద్రాక్ష, నాగాభరణం, డమరుకం దారుడై పులి చర్మంపై పద్మాసన స్థితిలో విగ్రహాన్ని రూపొందించారు. ఇరువైపుల సింహం నోరు తెరిచి నట్లుగా కొండ గుహలను ఏర్పాటు చేసి వీటి మధ్య దేశంలోని అత్యంత ప్రాముఖ్యత పొందిన ద్వాదశ జ్యోతిర్లింగాలను, గురు పీఠాలను ప్రతిష్ఠించారు. అమృతేశ్వరస్వామి విగ్రహం ముందర నీటి మధ్యలో నిర్మించిన గర్భగుడిలో ఘర్ నుంచి తెప్పించిన మరకత లింగాన్ని ప్రతిష్ఠించారు. జలపాతం చుట్టు భూగర్భంలోనే అష్టాదశ శక్తి పీఠాలైన అమ్మవారి విగ్రహాలను కొలువుంచారు. ప్రతినిత్యం స్వామి,అమ్మవార్లకు విశేష అభిషేకాలు, అర్చనలు శాస్త్రయుక్తంగా చేస్తున్నారు. పట్టణంతో పాటు పలు ప్రాంతాలకు చెందిన, ఆలయం వైపుగా వెళ్లే భక్తులు తప్పకుండా స్వామివారిని దర్శించి పూజలు చేస్తుంటారు. కార్తీక మాసంలో మహాశివుని రూపాలైన ద్వాదశ జ్యోతిర్లింగాలను ఒకేచోట దర్శించు కునేందుకు భక్తులు బారులు తీరుతారు.

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

అమృతేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం గణపతి పూజ, రక్షాబంధనము, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సాయంత్రం ప్రధాన కలశస్థాపన, దీక్షాహోమం, శుక్రవారం ఉదయం ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు, అన్నాభిషేకం, ఆవాహిత దేవతా హోమాలు, సాయంత్రం 6 గంటలకు పార్వతీ పరమేశ్వరుల దివ్యకళ్యాణోత్సవం, ప్రసాద వినియోగం, శనివారం రుద్రహోమం, లక్ష్మీనారాయణ హోమం, నవగ్రహహోమలు, అష్టాదశ శక్తిపీఠాలలోని అమ్మవార్లకు చండీహోమం, మహాపూర్ణాహుతి తదితర పూజాకార్యక్రమాలు జరుగనున్నాయి. అలాగే రోజు ద్వాదశ జ్యోతిర్లింగాలకు, అష్టాదశ శక్తి పీఠాలకు, నవరత్నలింగాలకు విశేష పూజాకార్యక్రమాలు చేయనున్నారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించి తీర్థప్రసాదాలను స్వీకరించాలని అమృతేశ్వరస్వామి ఆలయ కమిటీ ప్రతినిధులు కోరారు. నిర్వాహకులు బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

తైక్వాండో పోటీలు ప్రారంభించిన ఎమ్మెల్సీ

పోరుమామిళ్ల : పోరుమామిళ్లలో నిర్వహిస్తున్న తైక్వాండో జిల్లా స్థాయి పోటీలను బుధవారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి ప్రారంభించారు. వెంకటేశ్వర ఫంక్షన్ హాలులో మాస్టర్ నాయబ్‌రసూల్ తైక్వాండో జిల్లా స్థాయి పోటీలు ఏర్పాటు చేశారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా నలుమూలల నుంచి 250 మంది క్రీడాకారులు వచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ గోవిందరెడ్డి మాట్లాడుతూ పోరుమామిళ్లలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించడం గర్వకారణంగా ఉందన్నారు. క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలుపుతూ రాష్ట్రస్థాయిలో పాల్గొని జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. మాస్టర్ నాయబ్ రసూల్ తైక్వాండో కొరకు చేస్తున్న కృషిని అభినందిస్తూ, పార్టీ తరఫున సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఆయన వెంట రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు నాగార్జునరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక మై స్పేస్ తైక్వాండో క్రీడాకారులు పోరుమామిళ్లలో జరిగిన జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభకనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. సబ్ జూనియర్ బాలుర విభాగంలో హుస్సేన్, అబ్దుల్ ఫాహద్, సయ్యద్ బంగారు పతకాలు, రకీబ్, జతిన్‌లు రజత, విరాట్, అహద్, హుస్సేన్, శ్రేయాన్‌లు కాంస్యపతకాలు, సబ్ జూనియర్ బాలికల విభాగంలో ఫాతిమా, అలోక్య, గీతిక బంగారు పతకాలు, ఆఫ్రిన్ రజత పతకం, క్యాడెట్ బాలుర విభాగంలో సాయితేజ, అఫ్రిది, కీజేర్‌లు బంగారు పతకాలు, బ్రిజేష్ రజత పతకం, సకీబ్ కాంస్య పతకాలు సాధించారు. క్యాడెట్ బాలికల విభాగంలో సమరుల్ హుడా బంగారు పతకం, జూనియర్ బాలుర విభాగంలో శ్రావణ్, షణ్ముఖ, కేదార్, మూసా, ధాత్రిన్ బంగారు పతకాలు, జూనియర్ బాలికలో ఖన్సా రుహుళ్ల బంగారు పతకాలు సాధించి సత్తా చాటారు. సీనియర్ బాలుర విభాగంలో ఇస్మాయిల్, సాయి కల్యాణ్, రియాజ్ బంగారు పతకాలు సాధించినట్లు అకాడమీ కోచ్ మహబూబ్ బాషా తెలిపారు. బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు జూన్ 9 నుంచి 11వ తేదీ వరకు తాడిపత్రిలో జరిగే రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొంటారన్నారు. పతకాలు సాధించిన వారిని కోచ్‌తో పాటు ఇన్‌స్ట్రక్టర్ సలీం అభినందించారు.

ఛాంపియన్‌గా పోరుమామిళ్ల

పోరుమామిళ్లలో బుధవారం జరిగిన జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో పోరుమామిళ్ల ఓవరాల్ ఛాంపియన్‌గా నిలచిందని మాస్టర్ నాయబ్‌రసూల్ తెలిపారు. ద్వితీయ ఛాంపియన్‌గా ప్రొద్దుటూరు, తృతీయ ఛాంపియన్‌గా జమ్మలమడుగు ట్రోఫీలు కైవశం చేసుకున్నాయన్నారు. టోర్నమెంట్‌లో బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు అనంతపురం జిల్లా తాడిపత్రిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ పోటీలకు అబ్జర్వర్లుగా సాయిబాబా, శ్రీనివాస్, అబ్దుల్ మజీద్ వ్యవహరించారని, సీనియర్ క్రీడాకారులు నరసింహ, ఉస్మాన్, సుభాష్, ఆంజనేయులు పాల్గొన్నారని నాయబ్‌రసూల్ తెలిపారు.


పోరుమామిళ్ల: తైక్వాండో పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ


ప్రొద్దుటూరు కల్చరల్: తైక్వాండో పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులు

ప్రతిభకు పదును పెట్టేందుకే మోడల్ డీఎస్సీ


ప్రశ్నాపత్రం విడుదల చేస్తున్న యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు, డీవైఎఫ్ఐ నాయకులు

బద్వేలు అర్బన్ : డీఎస్సీ అభ్యర్థులకు పరీక్షల పట్ల అవగాహన కల్పించడంతో పాటు పరీక్షల పట్ల ఉన్న భయాన్ని పోగొట్టేందుకు మోడల్ డీఎస్సీ ఎంతగానో ఉపయోగపడుతుందని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు విజయకుమార్ పేర్కొన్నారు. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని గౌతమ్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన మోడల్ డీఎస్సీ పరీక్షకు ముఖ్య అతిథిగా హాజరై ప్రశ్నాపత్రాన్ని ఆవిష్కరించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.నాగేంద్రబాబు, డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్‌షరీఫ్, ఆదిల్ పాల్గొన్నారు.

డీఎస్సీ మోడల్ పరీక్ష విజయవంతం

ప్రొద్దుటూరు : డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని సృజన కోచింగ్ సెంటర్‌లో డీఎస్సీ మోడల్ పరీక్షను విజయవంతంగా నిర్వహించినట్లు డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మేరీకుమార్, విశ్వనాథ్ తెలిపారు. డీఎస్సీ మోడల్ పరీక్ష ప్రశ్నపత్రాన్ని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, సృజన కోటింగ్ సెంటర్ అధినేత సృజన్ విడుదల చేశారు.

ఇసుక దిబ్బలలో రైతులు జోక్యం చేసుకోకూడదు


ఇసుక దిబ్బలను పరిశీలిస్తున్న తహసీల్దారు, సిబ్బంది

చాపాడు : పెన్నానది పరీవాహంలోని ప్రభుత్వ ఇసుక దిబ్బలలో రైతులు జోక్యం చేసుకోకూడదని, దీనిపై ఏ ఒక్కరికీ హక్కు ఉండదని తహసీల్దారు రమాకుమారి పేర్కొన్నారు. మండలంలోని వి.రాజుపాలెం సమీపంలోని సర్వే నెంబరు 490లో గల ఇసుక దిబ్బలను బుధవారం తహసీల్దారు రమాకుమారి పరిశీలించారు. ఈ ఇసుక దిబ్బల కారణంగా మంగళవారం రాజుపాళెంకు చెందిన పల్లెం శ్రీనివాసులు, నలసింగ్ చిన్న కుళ్లాయప్ప కుటుంబీకులు మధ్య ఘర్షణ జరిగింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో బుధవారం తహసీల్దారు తమ సిబ్బందితో కలసి సమస్యాత్మకంగా మారిన ఇసుక దిబ్బను పరిశీలించి కొలతలు వేశారు. ఈ దిబ్బలు ప్రభుత్వానికి సంబంధించినవని వీటిపై ఏ ఒక్క రైతుకు హక్కు ఉండదన్నారు. ఇప్పటికే పెన్నానది పరీవాహంలో రైతులు చట్టవ్యతిరేకంగా భూములు సాగు చేసుకుంటున్నారన్నారు. ఇసుక దిబ్బలను తమవిగా భావించి రైతులు ఘర్షణకు పాల్పడరాదని సూచించారు. ఇసుక దిబ్బలకు చెందిన ఎలాంటి ఆధారాలు ఉన్న రైతులు తీసుకురావాలని, అప్పటి వరకూ ఈ ఇసుక దిబ్బలతో ఎవరూ ఇసుక తోలరాదని, సాగు చేసుకోకూడదని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శివశంకర్, సర్వేయర్ లక్ష్మీనారాయణ, వీఆర్ఓ పెద్దయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

రాయలసీమ రైస్ మిల్లర్ల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న రైస్ మిల్లర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కందుల మునిరెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : రాయలసీమ రైస్ మిల్లర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని రైస్ మిల్లర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కందుల మునిరెడ్డి తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతంలో చౌక దుకాణాలకు సరఫరా చేసే దొడ్డు బియ్యం పంటను ఎక్కడా రైతులు సాగు చేయడం లేదన్నారు. కేవలం సన్నరకం ధాన్యాన్ని సాగు చేస్తున్నారని తెలిపారు. ఈ సన్న బియ్యం సీఎంఆర్ ద్వారా కొనుగోలు చేయకపోవడంతో రైతులు, రైస్ మిల్లర్లు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రైతులకు బోనస్ ప్రకటించి ఆదుకోవాలని కోరారు. బోనస్ ఇవ్వడం వల్ల రైతులు, రైస్ మిల్లులు, మిల్లుల్లో పనిచేసే కార్మికులు ప్రయోజనం పొందారని పేర్కొన్నారు. 2015–2016 ప్రాంతంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు రైస్ మిల్లుల సమస్యలను పరిష్కరించడానికి ఆదేశాలు జారీ చేసి ఆదుకున్నారని తెలిపారు. ప్రస్తుతం నెలలో ఐదారు రోజులు మాత్రమే మిల్లులు పనిచేస్తున్నాయని, పరిస్థితి ఇలాగే కొనసాగితే రైస్ మిల్లులు మూసేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. తమను ఆదుకోవడానికి సన్నబియ్యానికి బోనస్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో ప్రొద్దుటూరు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండయ్య, కోశాధికారి బొగ్గరపు వెంకటేశ్వర్లు, రైస్ మిల్లర్ల ఓనర్లు వెంకట సుబ్బారెడ్డి, నారుబోయిన రవికుమార్, జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన బద్వేలు ఎమ్మెల్యే


వైఎస్ జగన్‌ను కలిసిన బద్వేలు ఎమ్మెల్యే, నేతలు

బద్వేలు అర్బన్ : వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ, పలువురు వైఎస్సార్ సీపీ నేతలు కలిశారు. ఈ సందర్భంగా బద్వేలు, బి.కోడూరు మండలాలకు చెందిన పలువురు నాయకుల సమస్యలను జగన్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో బద్వేలు, బి.కోడూరు జెడ్పీటీసీలు చిన్నపోలిరెడ్డి, ఎస్.దావీదు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వంకెలపెద్దపోలిరెడ్డి, సర్పంచ్ జయరామిరెడ్డి, కౌన్సిలర్ ఓబుల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, రాజశేఖర్ పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులు దూరం


చాపాడులో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

చాపాడు : వ్యక్తిగత పరిశుభ్రత ద్వారా వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని వైద్యాధికారులు తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, నక్కలదిన్నెలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో బుధవారం రుతుక్రమం ఆరోగ్యం, పరిశుభ్రత దినోత్సవంపై వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. చాపాడులో వైద్యాధికారులు డా.రాజేష్‌కుమార్, డా.శ్రీవాణి, నక్కలదిన్నెలో వైద్యాధికారులు డా.కావ్య మాధురి, డా.ఓబులేసు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య విస్తరణాధికారి ఎం.రాఘవయ్య, సూపర్‌వైజర్ ప్రసాద్, ఫార్మసీ అధికారి సుభాషిణి, స్టాఫ్ నర్స్ శిల్ప, ల్యాబ్ టెక్నీషియన్ పద్మావతి, ఏఎన్ఎంలు సుజాత, శాంతకుమారి పాల్గొన్నారు.

బద్వేలు అర్బన్ : యుక్తవయస్సులో ఉన్న బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జె.వినయ్ కుమార్ పేర్కొన్నారు. తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ పరిధిలోని వనంపుల పంచాయతీ నందిపల్లె గ్రామంలో బుధవారం రుతుక్రమ ఆరోగ్యం, పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా అవగాహన కల్పించారు. హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య,సీహెచ్ఓరమాదేవిపాల్గొన్నారు.

బి.కోడూరు : కిశోర బాలికలు, మహిళలు రుతుక్రమ సమయంలో వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు, డాక్టర్ ఉదయ్‌కిరణ్ తెలిపారు. బుధవారం అంతర్జాతీయ రుతుక్రమ పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా వైద్యాధికారుల ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. రాష్ట్రీయ కిశోర స్వాస్థ కార్యక్రమం కౌన్సిలర్ భారతి, హెల్త్ సూపర్‌వైజర్లు జాన్‌విలియం, విజయలక్ష్మి, ఫార్మసిస్టు వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నేడు రాజువారిపేటలో బండలాగుడు పోటీలు

చాపాడు: మండలంలోని రాజువారిపేట గ్రామంలో శ్రీ అభయ ఆంజనేయ స్వామి 16వ వార్షికోత్సవం పురస్కరించుకుని గురువారం పూజా కార్యక్రమాలతో పాటు బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు. ఓల్డ్ కేటగిరి వృషభరాజములచే నిర్వహించే బండలాగుడు పోటీలలో గెలుపొందిన ఎద్దుల యజమానులకు రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.9వేలు, రూ.7వేలు, రూ.5వేలు చొప్పున నగదు బహుమతులను అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ధ్యానం ప్రశాంతతకు మార్గం


నీతికథలు చదువుతున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు : ధ్యానం ప్రశాంతతకు మార్గమని చాపాడు ఎంఈఓ వంశీ కృష్ణ విద్యార్థులకు సూచించారు. స్థానిక పుట్టపర్తి నారాయణాచార్యులు ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో బుధవారం మాజీ సీఎం ఎన్టీ రామారావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూ ధ్యానం చేయడానికి ధనం ఖర్చు చేయాల్సిన అవసరం లేదన్నారు. ప్రతి ఒక్కరూ రోజూ ధ్యానం చేయడం ద్వారా సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని పేర్కొన్నారు. తాళ్లమాపురం రిటైర్డ్ హెచ్‌ఎం గోపీనాథ్‌రెడ్డి, రిటైర్డు టీచర్ చాడా మునిశేఖర్‌రెడ్డి, గ్రంథాలయాధికారిణి తిరుపతమ్మ పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో మేధాశక్తి

అట్లూరు : విద్యార్థులకు పుస్తక పఠనంతో మేధాశక్తి పెరుగుతుందని గ్రంథాలయాధికారి ఎం. సుధాకర్ తెలిపారు. మండలంలోని అట్లూరు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి విజ్ఞాన తరగతులు నిర్వహిస్తున్నారు. బుధవారం ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులతో పుస్తక పఠనం చేయించడంతో పాటు తెలుగు నీటి కథలు చదివించారు. కార్యక్రమంలో మస్తానయ్యయాదవ్, కృష్ణారెడ్డి, రఘు, కేశయ్య తదితరులు పాల్గొన్నారు.